

**5**

## మధురాంతకం నరేంద్ర

# పరమపద సోపానం

ఈ ఆటెవ్వురైనా వొంటిగా ఆడతారా? ఈ మాదిరిగా వొంటిగా ఆడతావుంటే యెవ్వురైనా దీనికి పిచ్చిపట్టిందని అంటారేమో అని భయపడి చస్తావుండాను. అడిన ఆటనే యెన్నిదినాల్లో మాదిరిగా ఆడితిందీ పిల్ల? దీనికి మంచి బుద్ధెప్పుడొస్తింది?

× × ×

"ఆడిన ఆటనే మళ్ళా యెవురూ ఆడరు. కాయ కొండెక్కేసిందంటే ఆటయిపోయినట్టుకాదు. వొకాటయిపోతే యింకో ఆట రెడీగా ఉంటింది. ఈ ఆటలన్నీ కలిస్తే పెద్దాట అవతాది" అంది శ్రీమతి పళ్ళుగ్గబట్టుకుని పట్టుదలతో దాయాలు విసురుతూ.

"మళ్ళా ఆ కాగితాన్ని పరుచుకొని కుచ్చున్నాది. ఇట్లాంటప్పుడు అంత నిమ్మళంగా ఆ పాడూ ఆట యెట్లాడతాదో? మొదటిసారి పెండ్లి తప్పొయ్యినప్పుడే బొగిసాట్లయిపోయింది. ఇంకా తలెత్తుకోలేకుండా వుండాను. ఇప్పుడీ రెండోసారి గూడా గొంతులమీది కొచ్చుండాది. ఇప్పుడేం చేసేది రాముండ దేవుడా అని నేను అంగలారస్తావుండాను. దీనికేమో యింగా ఆటలమీదే ఉండాది..." లోకమ్మ జలధారిలో గిన్నెలు కడుగుతూ కాకరించింది.

పరమపద సోపానపటంలోంచీ తలతిప్పకుండా "రెండూ...దాయం" అని దాయాల్ని లెక్కబెట్టుకుంటూ కాయను ముందుకు జరిపింది శ్రీమతి.

లోకమ్మ జలధారిలోంచీ వీధిలోకి చూపులు తిప్పి "నిన్ననగాపోయినారు. నా కడుపులో కొడుకుగా పుట్టిన పాపానికి యింకా యెన్ని అగసాట్లు రాసిపెట్టుండాయో వానికి? ఆ పెండ్లోళ్ళు యెందుకని యెనకడుగేసినారో తెలవదు. వాళ్ళేం చెప్పినారో, వీడేం జవాబు చెప్పినాడో తెలవదు. తలుసుకోని తలుసుకోని నేను దిగులు పెట్టుకునేసినాను. ఈ పిల్లేమో యింకెవురికతో అయినట్టుగా జమ్మని ఆడతావుండాది...." అంటూ కాకరించడంకోసం మాట్లాడటం ఆపింది.

వంటిల్లా, హాలూ, వరండాలు మాత్రమేవున్న బండ్ల మిద్దెలోకి రావడానికి సందేహిస్తూ యెండ వీధిలోనే ఆగిపోయివుంది. చీకటి జలధారి కవతలి యిరుకు జలధారి నుంచీ చిత్తడి హాల్లోకి దురాక్రమణ చేస్తోంది. హాలుకున్న వొంటరి కిటికీలోంచీ జనాల సందడిలేని యిరుకు వీధి బితుకుబితుకుమని తొంగి చూస్తోంది.

శ్రీమతి దాయాలు విసిరాక "యింకో మూడు పడితే నిచ్చెన... నేరుగా యాభైలోకి... యింకో రెండు సరైన ఆటలు పడితే కొండెక్కేయచ్చు..." అని పెద్దగా నవ్వుకుంది. "ఆ పక్కింటి పిల్లోడ్ని భలేయాపూరించేసినాను. వానికింకా పదేండ్లు గూడా వచ్చుండవు. పది రూపాయలిస్తాను అంటే వాడు యేకంగా పెండ్లికి గూడా వొప్పుకునేటట్టుండాడు. ఇంట్లో వాళ్ళమ్మ యేపని చెప్పినా చెయ్యడని మొత్తుకుంటాది. కానీ నేనేంచెప్తే అట్లా ఆడతావుండాడు. వానికీ వయసునుంచే ఆడోళ్ళను జూస్తే సొంగ కారిపోతావుండాది... దాయం... నాలుగూ... నరకాసురుడు మింగింది పాము. మళ్ళా వోకిట్లో కొచ్చేసింది కాయ... తూత్తెరీ..."

కడిగిన గిన్నెల్ని వంట గదిలోకి తెచ్చుకుంటూ "అనేదేందో గెట్టిగా అనదు. మాట్లాడతా వుండాదో, వక్కపొడి నవలతా వుండాదో గూడా తెలవదు" అని మూతితిప్పిన లోకమ్మ గొంతులో యేదో తగులుకున్నట్టుగా కాకరించింది.

వీధిలోంచీ యిలాకటి విసురుకొచ్చింది. శ్రీమతి విసుగ్గా పటంలోంచే తలపైకెత్తింది. వీధి కటువైపునున్న టీ కొట్టులో బైలరుముందు నిలబడి గ్లాసులు కడుగుతూన్న యువకుడు తల అటుకేసి తిప్పేశాడు.

"ధైర్యముంటే యెదురుగ్గా యిాలేయాల... యీధిలో మొగోళ్ళెవరూ లేనప్పుడు పులి... యెప్పుడో దొరికిపోయినప్పుడు తెలిస్తింది యీ యీధి సంగతేందో... తలా నాలుగు దెబ్బలు పడితే వొళ్ళంతా మూటయిపోవాల..." వూహించుకున్న సన్నివేశం యిప్పుడే జరుగుతున్నట్టుగా శ్రీమతి కసిగా నవ్వుకుంది.

వీధిలో యెండ వొంటరిగా ఉంగలు



చుట్టుకుపోతోంది. నీడలు వొకదానికొకటి బయపడి దూరంగా పారిపోతున్నాయి.

గొంతు కాకరించుకుంటూ వచ్చి, బియ్యమున్న చాటతో బాటూ హాల్లో ద్వారానికెదురుగా కూచుని, నవ్వుకుంటున్న కూతురికేసి అదోలా చూసి, అర్థమయినట్టుగా తలవూపి "టీ అంతా అట్నే మిగిలిపోయినట్టుండాది... అంగట్లోకి యెవురూ పోవటంలేదు. నోట్లో నాలికలేని పిల్లోడు... యెట్ల బతకతాడో, పాపం!" అని వాపోయింది లోకమ్మ.

"దాయం... రెండూ... డెబ్బయి అయిదు... పాము మింగింది..." అని గొణుగుతూ తల్లికేసి చిరాకుతో చూసింది శ్రీమతి... "నోట్లో నాలిక లేనోడికే యిాలొచ్చేది! ఊరూపేరూలేకుండా గాలిక్కొట్టుకోనొచ్చే మనుషులంటే ఆ అంగిడాయిన కిష్టం. రెండు నెలలకు ముందీ గాలిమడిసి యెక్కడున్నాడో యెవురికీ తెలవదు. రేపు వుంటాడో పోతాడో యెవురికి తెలుసు? వీడు గొమ్మునా పొయ్యేటోడుగాదు. దెయ్యం మాదిరిగా కొమ్మేదో యిరిచేసేపోతాడు..."

గొంతులో పెద్దరాయేదో యిరుక్కున్నట్టుగా లోకమ్మ యిబ్బందిగా గొంతు సవరించుకుంది. బియ్యంలోంచీ యేరిన రాళ్ళను వీధిలోకి విసిరేస్తూ "యీ సంసారాన్ని వొకగడ్డకు చేర్చాల్సిన మనిషి నడంత్రంలోధిగ్గాలికేసి పోయినాడు. కసుగాయాలు మాదిరుండే యిద్దరు బిడ్డల్ని నా యెదాన్సేసి పోయినాడు..." అని మూల్గింది.

"మళ్ళీ మొదలుపెట్టింది దండకం... రెండూ... మూడూ... మళ్ళీ మింగింది పాము... నిచ్చెనేమో చిన్నది... పామేమో బారెడుంది..." శ్రీమతి పెద్దగా అరిచింది.

"మొగోడుగా పుట్టిన పాపానికి వారేమో పొద్దన్నించీ సాయంత్రం దాకా చెమటలు గారేటట్టు పనిజేసి, నెలకు రెండురూకలు తెస్తావుండాడు. ఈ ఆడబిడ్డను పెండ్లిచేసి తరివేసినాంక, వానిగ్గూడా వొకపిల్లను దెచ్చి ముడేసేస్తే, నావని అయిపోతింది..." లోకమ్మ గొంతుకేదో అడ్డురావడంతో మాటల్ని నగానికి నగం మింగేసింది. "దీని వయసుకే నాకిద్దరు బిడ్డలున్నారు. దీనీడోళ్ళు యిద్దరుముగ్గురు బిడ్డల్నెత్తుకోనుండారు... ఆ మొదటి సంబంధం సరైందయివుంటే, పెండ్లయిపొయ్యుణ్ణు. ఇప్పటికీ దీనికీ బిడ్డాపాపా అయుండురు. ఆ పిల్లోడు సదివినాడనీ, వుద్యోగముండాదనీ, ఖర్చుకొంచెం జాస్తీ అయినా వొప్పుకున్నాము. కానీ... వాడు..."

దాయాల్ని లెక్కబెట్టి కాయను ముందుకు తోస్తూ "ఆకోతిమూతోడు యింకొంచెం జాసీ దుడ్డొచ్చే

తావుకు జారుకున్నాడు... కొంపలంటుకొని పోయినట్టుగా ఆత్రం ఆత్రంగా పెండ్లి పత్రికలు వూరంతా పంచేస్తే అంతేగావాల్ల! సరైన శాంతి జరిగింది... రెండూ... అయిదూ... మూడూ..." అంది శ్రీమతి కోపంగా పళ్ళు కొరుకుతూ.

"నా బిడ్డల్ని యేడిపించినోళ్ళు బాగుపడరు... నా బిడ్డను... కాలేజీకి పోనీకుండా... యింట్లో కూర్చోబెట్టినోళ్ళకు ధూమొస్తింది..." లోకమ్మ గొంతుకు గళ్ళ అడ్డం వచ్చినప్పుడల్లా ఆపుతూ మాటల్ని విరగ్గొట్టసాగింది.

"రెండూ... దాయం... యింగొకరి మాట యినేదాన్నానేను!... తూత్తెరీ..." శ్రీమతి గింజుకుంది. "రెండూ... మూడు... మళ్ళా పాము... ఆ పాడూ కాలేజీలో చదువేలేదు. అందరూ ప్రేమలూ, పెండ్లిళ్ళూ అని గిరికీలు గొడతారే తప్ప యింకో ధ్యాసలేదు. యెవురెవురికో లింకులు తగిలించి కుళ్ళుకుంటారు. ఊరోళ్ళ పెండ్లికి ముందుగా నాకు వక్కాకు బెట్టండీ అంటారు. వాళ్ళముఖాలు జూసేదానికంటే యింట్లో గుచ్చునేదే మేలు... ఛ. ఛఛ... లెక్క తప్పొయ్యింది..." శ్రీమతి దాయలు కిందపడేసి తల్లిని మింగేసేలా చూసింది.

బియ్యంలో రాళ్ళేరడం పూర్తయ్యాక నిట్టూరుస్తూ పైకిలేచి "యింకారాలేదు. నా కడుపులో పుట్టినదానికి యింకా వానెన్ని అగసాట్లు పెడితిందో యిది?" అంటూ కూతురివైపుకు కోపంగా చూసింది లోకమ్మ.

"మర్లా ఆరూ, దాయం, నాలుగూ... వచ్చెనిచ్చెన... ముప్పయ్యినించీ నేరుగా యాభైకి... యింకో యాభై అరవై చానాగా తెచ్చిమ్మంటారు... ఇల్లో ప్లాటో రాసిమ్మంటారు... ఆమాత్రం గూడా సంపాయించి పెట్టకపోతే యెవురొప్పుకుంటారు? యీ పక్కింటి పిల్లోడింకా రాలేదు... వాడొస్తే యీ రంపుకంతా సరైన శాంతి జరిగితింది... యీ కాయ కొండెక్కాల... వీళ్ళందరికీ బుద్ధిరావాల్ల..." శ్రీమతి రుసరుసలాడుతూండగా యీలొకటి వలకరించింది. ధిగ్గున తలెత్తి చురచురా చూసింది శ్రీమతి. గురుమూర్తి కొనచూపులు చూస్తూ కనిపించీ కనిపించని నవ్వుతో పలకరిస్తున్నాడు. "పెరట్లో పెరిగిన నాలుగు వంకాయ చెట్లకు చీడబట్టిందని అంటే పక్కింటి పిల్లోడు నమ్మేసినాడు... వాని లోపలంతా డొల్లే!..." శ్రీమతి పళ్ళు పటపట కొరుక్కుంది.

"యెంత అణకవగా వున్నా అంత టెక్కెందుకు వాళ్ళకు?" వంటగదిలోంచీ లోకమ్మ మాటల కాకరింపుల మధ్య కకావికలుగా తెగిపడుతున్నాయి. యేంకావాల్నో చెప్పమని... మధ్యవర్తులతో చెప్పంపించినాం... గదా!... యింకా యేంచెయ్యాల? యీ ఆడబిడ్డనెట్ల... సాగనంపాల?..."

యెదురంగడిలోంచీ మళ్ళీ యీల హుషారుగా పలకరించింది.

"మూడు... అరవైమూడు... నేరుగా యెనభైమూడుకు నిచ్చెన..." అంటూ తలపైకెత్తి, కిటికీలోంచీ చూస్తూ చిరునవ్వు నవ్వింది శ్రీమతి. "సాగనంపించేదానికి యింక ఆలస్యంలేదు. పక్కింటి పిల్లోడేమయినాడు? నదీదోవలో గర్ల్‌ఫ్రెండెవురైనా గనబడి లాక్కోని పొయ్యిందా?..." చేయెత్తి వూపింది శ్రీమతి. కొట్టులోకూర్చున్న గురుమూర్తి వులిక్కిపడి, అంతలో భయపడి తలతిప్పుకున్నాడు. శ్రీమతి యిటురమ్మన్నట్టుగా చెయ్యూపింది. అతను కంగారుపడుతూ చుట్టూ కలయజూశాడు. యెవరూలేరు, రమ్మన్నట్టుగా సైగచేసింది శ్రీమతి. వెనక్కు లాగుతున్న కాళ్ళను బలవంతంగా ముందుకు కదుపుతున్నట్టుగా యెబ్బెట్టుగా నడచివచ్చి కిటికీ కవతల నిల్చున్నాడు గురుమూర్తి.

రహస్యం చెప్పబోతున్నట్టుగా శ్రీమతి కిటికీకేసి తలవంచింది

గురుమూర్తి బెదురుతో వెనక్కో అడుగేశాడు.

"యెక్కడికి పోదాం? చెన్నయికా? బెంగుళూరుకా?" శ్రీమతి వంటింటికేసి చూస్తూ, కనిపించని వ్యక్తి నెవరినో సాధిస్తున్నట్టుగా పెదవి కొరుక్కుంటూ ప్రశ్నించింది.

గురుమూర్తి బెంబేలు వడిపోయి పరిగెత్తబోయాడు.

దగ్గరకు రమ్మన్నట్టుగా దోరగా నవ్వాక "రాత్రి పన్నెండుకు... రెడీగా వుండు..." అంది శ్రీమతి.

అతను అటూయిటూ తలతిప్పి, అయోమయంగా చూస్తూ, తలగోక్కున్నాడు.

"సరే... పో... రాత్రి... పన్నెండుకు... సరేనా?" శ్రీమతి యీసారి మళ్ళీ కవ్వించడానికి రమ్మన్న నవ్వు కసిగా పుట్టుకొచ్చింది. గురుమూర్తి మరోసారి బెదురుచూపుల్ని యింటిలోకి సారించాక, వెనక్కు యెగసిపడే బావురుకప్పలా టీ అంగడిలోకి నడుచుకెళ్ళాడు.

"నాలుగూ... రెండూ... మూడూ... తొంభైమూడూ... పాము చిన్నదే! అయినా మింగింది... దెబ్బయి మూడ్లోకొచ్చి పడిందికాయ... యీ పొద్దు యీ ఆటో నేనో తేలిపోతింది... యీ కాయ కొండెక్కేదాకా యిడిసి పెట్టేదిలేదు. పక్కింటి పిల్లోడు రాకపోయినంత మాత్రాన ఆట ఆగేదిలేదు. గురుమూర్తిగారు గొర్రెపిల్ల మాదిరిగా దొరికినాడు. యింక జూసుకో... రెండూ మూడూ దాయం...."

వంట గదిలోంచీ వరసగా కాకరింపులే వినబడుతున్నాయి. పెద్ద కాకరింపొకటి యెంతకూ తెగకపోవడంతో లోకమ్మ అతలాకుతలమైపోతోంది.

"నాలుగూ, అయిదూ... దాయం, పన్నెండూ... ముప్పయ్యేడుకు... పడితే నిచ్చెనుండే దానికైనా పడాల... లేకపోతే పామైనా మింగాల... రెండూలేని యీ తుక్కాటనెవరు పడమన్నారు?"

వంటింటిలోంచీ వున్నట్టుండి వికృతంగా దొర్లుకొచ్చిన నిశ్శబ్దాన్ని అనుమానంగా చూసింది శ్రీమతి.

"రెండూ... దాయం... అయిదూ... ఆరూ... యాభైవొకటికి... యిదేం బాగలేదు..."

మరోసారి వంటగదికేసి కళ్ళు చిట్లించుకుని చూశాక దాయాల్ని పిడికిట్లో బిగించుకుని, కాయను పైకితోసి, నీల్గుతూ పైకిలేచింది శ్రీమతి.

వంటగదిలో పొయ్యిముందు, పొడవాటి కట్టెలా పడివున్న లోకమ్మ నీరసంగా మూలుగుతోంది. రెండు చేతుల్తోనూ ఆమెను కుదిపాక, కోపంగా వురిమిచూసింది శ్రీమతి. దాయాల్ని మరోచేతిలో మార్చుకుని, గాలికెగరబోతున్న వరమువద



ఎస్.వి.డి. సాహితీ సంస్థ, హైదరాబాద్‌వారు 21-3-2010 ఆదివారంనాడు వికృతినామ ఉగాది పురస్కారాలు 2010 ఏర్పాటుచేసిన సభ సందర్భంలోని ఈ చిత్రంలో సభాధ్యక్షులు శ్రీ ఎం. మనోజ్‌కుమార్ గారు, జిల్లా గ్రంథాలయ సంస్థ, రంగారెడ్డిజిల్లా ఆతీయ అతిథులు శ్రీ జె.ఎస్.మూర్తిగారు, శ్రీ సుధామ, పురస్కారం గ్రహీతులు ఉత్తమ కవితా సంపుటి 'మనిషిజాడ' రచయిత శ్రీ ఎమ్వీ రామిరెడ్డిగారు, ఉత్తమ కథా సంపుటి 'మువ్వలు' రచయిత శ్రీ భమిడిపాటి జగన్నాథరావు, ఎస్.వివేకానంద, శ్రీ పి. జానకీరాములు

సోపానపటంపైన గుండ్రాయినిపెట్టి, గుమ్మం దగ్గరికెళ్ళి గురుమూర్తిని రమ్మన్నట్టుగా సైగచేసింది.

గురుమూర్తి లేడిపిల్లలా కళ్ళటూ యిటూ తిప్పాక, బెదురుతూనే దగ్గరికొచ్చాడు.

"ఆ మూల ఆస్పత్రిలో డాక్టరుంటాడు. పేషెంట్లెవురూ వుండర్లే! యీగలు తోలుకుంటా వుంటాడు. మా అమ్మ మళ్ళా కాళ్ళు నిగడదీసింది. చిన్నగా తొడుక్కోని రాపో...." అంది శ్రీమతి విసుగ్గా.

యెవరో తరుముతున్నట్టుగా గురుమూర్తి వీధిలో డిస్పెన్సరీ వైపుకు దూసుకుపోయాడు.

తిరిగొచ్చి, పటంముందు కూర్చుని, దాయాలు విసురుతూ "రెండూ... నాలుగూ... వొకటీ... పదముందుకూ... వర్వాలేదు... పనికొస్తాదు..." అని కసిగా నవ్వింది శ్రీమతి... "ఆట మంచి జోరుమీదుండేటప్పుడు కావాలని కాళ్ళు జాపేస్తింది. మూడూ... దాయం... వొకటీ... యెక్కొ నిచ్చెన... రేపట్నించీ కాళ్ళు జాపినా అడిగేదానికి మనిషుండర్లే... యీ దొంగ రోగాలు రమ్మన్నారావు... యీ పొద్దుకు పక్కింటి పిల్లోడు రాడా?... రెండూ... దాయం... పన్నెండూ..."

తెల్లపాంటూ షర్టూ తొడుక్కున్న స్టెతస్కోపులా పొడుగ్గా, సన్నగావున్న డాక్టరు యధాలాపంగా యింటిలోపలకొచ్చి "యెక్కడ?" అని అడిగాడు.

దాయాల్ని చేతబట్టుకుని బలవంతంగా పైకిలేచాక శ్రీమతి వంటింటివైపుకు చేయిచాపింది.

వంటగదిలో కొచ్చి, అలాగే నేలపైన గొంతుకూచుని, లోకమ్మ చేయిపట్టుకుని నాడినిచూస్తూ డాక్టరు అలౌకికమైన ఆనందాన్ని అనుభవిస్తున్నవాడిలా కళ్ళు అరమోడ్చుకున్నాడు. తరువాత తన యెర్రరంగు సంచీలోంచే యెర్రరంగు గాజుసీసా నొకదాన్ని వెతికిలాగి, యూజ్ అండ్ త్రో సిరెంజీసూదిని దాంట్లోకి నిర్లక్ష్యంగా గుచ్చాడు. లోకమ్మ ముంజేతిపైన వ్రేళ్ళలా పాకుతున్న నరాల్లో నొకదానిపైన కోపంవున్న వాడిలా సూదిని గుచ్చాడు.

లోకమ్మ పెదవులు కదిలాయి. మూలుగుతో కలిసిన కాకరింపు గీపెట్టింది.

నాలుగు అంకెలా కూర్చున్న డాక్టరు ఏడంకెలా లేచి నిల్చుని, కాగితం ముక్కపైన నాలుగైదు గీతలు రాసి "ఊరికే ఆలోచనలు చెయ్యగూడదు... టయానికి తినాల... గ్లూకోజు తాగాల... యీపైనుండే మాత్రలు దినాని మూడుసార్లు... కిందుండేది రెండుసార్లు... మధ్యలో వుండేది రాత్రి నిద్రపొయ్యేముందు" అన్నాడు గోడతో.

శ్రీమతి హాలు గోడకున్న అలమారు తెరిచి, రేకు డబ్బాలోంచీ దొరికిన నోట్లుతీసి డాక్టరు ముందుకుచాపి "యాభై" అంది.

నోట్లు మడచి జేబులో పెట్టుకున్నాక, యెర్రరంగు తోలుసంచిని వూపుకుంటూ డాక్టరు గడపదాటి వీధిలో కెళ్ళిపోయాడు. వెంటనే అదే గడపలోంచీ లోపలికి తొంగిచూసిన గురుమూర్తితో "రాత్రి... పన్నెండు..." అంది శ్రీమతి. అతను కళ్ళార్పకుండా ఆమెకేసి కాస్సేపు చూసి, తరువాత యెవరో లాగుతున్నట్టుగా యెదురంగడిలోకి పరిగెత్తాడు.

దిండొకటి తెచ్చి లోకమ్మ తలకింద పెట్టాక హాల్లోకొచ్చి పటంముందు కూర్చుంది శ్రీమతి. "యింకా డెబ్భయి మూడులోనే వుండావా నువ్వు" అంటూ కాయపైన వొకటి మొట్టింది. "పద...పద... నడువే ముందుకు... యిప్పటికే లేటయిపోయినావు... పక్కింటి పిల్లోడినే పాము మింగింది? యెదురంగడి గురుమూర్తి యింకా యీలేయ లేదెందుకు?..." కిందికి విసరబోయిన దాయాలనలాగే పట్టుకుని పటాన్ని విసుగ్గా చూసింది శ్రీమతి... "వొకటి... రెండు... హూ! మొత్తం పదినిచ్చెనలు... పాములు మాత్రం పన్నెండు... యీ పటంలోనే యేందో తప్పుండాది..." కోపంగా పటాన్ని రెండు చింపబోయి, అంతలో ఆగిపోయింది... "అంత చిన్నాగా నిన్నొదిలేది లేదు... పదేముందుకు... యీపొద్దు కొండెక్కే తీరాల... రెండూ... నాలుగూ... మూడూ..."

"అక్కా... అక్కా..." పక్కింటి పిల్లాడి గొంతు వినబడగానే శ్రీమతి వులిక్కిపడి, దాయాల్ని కిందపడేసి, కిటికీలోంచీ చేయి బయటికి చాపింది.

పిల్లాడు దీనంగా ముఖంపెట్టి "దొరకలేదక్కా!" అన్నాడు. శ్రీమతి రోషంతో బుసలుగొట్టింది.

"నిన్నటిదాకా యింట్లోనే వునిందక్కా! కానీ యీ పొద్దు తెల్లార్తో చిన్నకయ్యలో చల్లాలని మానాయి నెత్తుకొని పోయినాడంట! దానికే సరిపోయేదంట... రేపో, మొన్నాడో కొత్త పురుగులమందు తేవాలన్నాడు మానాయిన... అప్పుడు మరవకుండా చానాగానే తెచ్చిస్తాను..." మాటలు పూర్తిగాక మునుపే పరిగెత్తిపోయాడువాడు.

"రేయ్... నా పది రూపాయలు..." శ్రీమతి మాటలు గొంతులోనే అణిగిపోయాయి. "దొంగెధవ... పోరంబోకెధవ..." కోపంతోనూ, అవమానంతోనూ ఆమె పెదవులు అదరసాగాయి... దాయాలు అందుకుని రౌద్రంగా కిందికి విసిరింది. "మూడూ... నాలుగూ... యెప్పుడే దొంగముండా నువ్వు కొండెక్కేది? రెండు గుక్కల పురుగుల మందుతో యీ పొద్దుతో కతయిపోయున్ను... చచ్చేదానికి గూడా యింత కష్టపడాల్నా? పదే ముందుకు... యెప్పుడూ పాముల్నోట్లో పడాలనే యావేగానీ నిచ్చెనెక్కాలనే యావే వుండదా నీకు?... ముదనష్టంముండా... పోకిరెధవా!..." శ్రీమతి తోచిన తిట్లన్నీ తిట్టసాగింది.

వంటగదిలోంచీ లోకమ్మ నీరసంగా కాకరించి, గొంతు సవరించుకుంది. "యీ పొయ్యారిపొయ్యింది... దీనికల్లా చూడకుండా... యింకా ఆ వొంటాట ఆడతానే వుండాది... యిది ఆ వొంటి ఆట ఆడేది... ఆపినప్పుడుగానీ యీ యింటికి పట్టుందే శని యిడిచిపెట్టదు..."


"మందు వొంట్లోకి పోతానే గొంతులోకి శక్తి వచ్చేసింది. యింక నోరుముయ్యదు... లొడలొడ... లొడలొడ... శ్రీమతి చీత్కరించింది.

వీధిలో యింటిముందు కొచ్చి ఆగిన జీపు యింజను నోరు మూయకుండా ఆగడం చేస్తోంది. అంగిడాయన కీచుగొంతుక పెద్దగా గీపెడుతోంది. వీధిలో బూట్లు పరిగెడుతున్నాయి. దాయాలు విసిరాక కోపంగా తలెత్తి చూసింది శ్రీమతి. ఖాకీ చొక్కాలు, పాంట్లూ హడావుడిగా కదులుతున్నాయి.

ఇంటిలోపలి కొచ్చిన వ్యక్తి చెప్పుల్ని తలుపు వెనక విడిచాక శ్రీమతికేసి కళ్ళు చిట్లించుకుని చూశాడు. మునిపంటితో కిందిపెదవిని బలంగా నొక్కిపెడుతూ శ్రీమతి చూపులు తిప్పుకుంది. అతను ఆమెను కొరకొరా చూస్తూ వంటింటిలో కెళ్ళాడు.

''యేమయింది?... యేమన్నారు?...'' అని అడిగింది లోకమ్మ మాటల్నీ కాకరింపుల్నీ కలగలిపి.

"నాతో పెట్టుకుంటే గొమ్ము



నుండేటోడ్నా నేను?" అతను తనకు కోపం తెప్పించిన వ్యక్తి యెదురుగానే వున్నట్టుగా గొంతెత్తి గర్జించాడు. "కట్నం దుడ్డుకోసరం దొంగెత్తేయద్దని నిలదీసినాను. ఆ మిద్దెంటోళ్ళ పిల్లోడు భలే అనుమానం మనిషిగా వుండాడు. వొట్టి బెదురుగొడ్డు... వారంముందు యేందో దవుటొచ్చి ఆస్పత్రికి పోయినాడంట! ఆ డాక్టరు లోకంలో వుండే టెస్టులన్నీ జేసి యేదో పెద్ద పేరుండే రోగంపేరు జెప్పినాడంట! దాంతో యీ వొంటూపిరోడు బెదిరిపొయ్యి, యింట్లో గూడా చెప్పకుండా చెన్నయికి పోయినారంట... అక్కడుండే పెద్దాసుపత్రులకంతా తిరగతావుండే వాళ్ళమ్మా నాయినా పట్టుకోని యింటికి తొడుక్కోనొచ్చినారు. మళ్ళీ టెస్టులన్నీ జెయ్యించితే డాక్టరు అసలు రోగమేదీలేదని తేల్చేసినాడంట... యిప్పుడా ముసిలోళ్ళు యింకాముందుగా ముహూర్తమేదయినా వుందేమో చూడమంటా వుండారు. లేనిరోగం పేరుజెప్పి దుడ్డు వూడబెరికే డాక్టర్లయితే వుంటారుగానీ, లేని ముహూర్తాలు వుండాయని జెప్పే పంచాంగాలేడ దొరకతాయి?..."

"నాకు తెలుసు... నాకు తెలుసు..." లోకమ్మ సంతోషం ఆమె గొంతులో అడ్డం పడుతున్న తెరల్ని చింపుకుంటూ బయటికి వస్తోంది. "నిన్న పొద్దన వెంగటేస్వరునికి ముడుపుగట్టి మొక్కినాన్లే!... యింక తిరుగేముండాది?"

వీధిలో ఆగిన జీపు స్వరాన్ని మార్చి అరుస్తోంది.

"యెదురుగ్గా వుండే టీ అంగిడొకటి మన పాణానికి... ఆవుపాతకం అంగిడాయిన యెంగెక్కడా మనిషే దొరకనట్టుగా దోవలో దొరికినోళ్ళనంతా అంగిట్లో జేర్చుకుంటా వుంటాడు. ఆ అంగిట్లో రెండుమూడు నెల్లుగా వున్న మనిషి పెద్ద కేడీ అంట లే! పోలీసులు చానా దినాలుగా గాలిస్తా వుండారంట – నేనింట్లోకి రాబోతావుంటే దోవలోనిలేసి వాళ్ళు నన్నేందేదో అడిగినారు. ఆ సంగతులన్నీ నాకెట్ల దెలస్తాయి?..." వాను పోలీసులమీది కోపాన్ని దేనిపైన చూపెట్టాలో తెలియనట్టుగా పెద్దగా రుసరుసలాడుతున్నాడు.

"నాకు తెలుసు... నాకు తెలుసు... వాన్ని చూసినప్పుడంతా నా కనుమానమే!..." లోకమ్మ రెండుసార్లు కాకరించింది... "నాకు తెలుసు... నా కడుపులో పుట్టిన బిడ్డకు నా సాలే వస్తిందని నాకు దెలుసు... నాగ్గూడా యిట్నే జరిగింది. మొదటి సంబంధం యెగిరిపొయ్యింది. రెండో సంబంధం యేడ్పించుకోని యేడ్పించుకోని తిప్పించింది. కానీ పెండ్లేమో జరిగింది..."

గోడకు చేరగిలబడిన శ్రీమతి స్తబ్దంగా చూస్తూండిపోయింది. పటంలోని కాయ యెనభై ఒకటో గదిలోంచీ వెక్కిరిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

"యే ముహూర్తంలో యీ యింటా కొచ్చినానో, అప్పటి నుంచీ అగసాట్లు పడతానే వుండాను. అప్పుడు అత్తమామా, ఆపైన మరుదులూ ఆడబిడ్డలూ... యీలోపల కట్టుకున్న పెద్దమనిషి తెలివిగా దాటుకున్నాడు... యీ యిద్దురు బిడ్డల్ని సాకి సంతరించేదాంతోనే ముసిలిదాన్నయిపోయినాను. యెప్పుడో యెత్తుకున్న బరువు... వొకటిపోతే యింగొకటి... బరువులేకుండా వునింది లేనేలేదు..." మాట్లాడుతూ హాల్లోకొచ్చిన లోకమ్మ కూతురుముందున్న పటాన్ని మింగేసేలా చూసింది. "యిదింకా వొంటిగా ఆడతానే వుండాది. దీనికో పెండ్లిజేసి, ఆ అత్తగారింట్లో యీ మాదిరి వొంటాట ఆడే తీరికలేకుండా జేస్తేగానీ నా పాణం నిమ్మళించదు. ఈమాదిరి వొంటాట ఆడితే చూసినోళ్ళు పిచ్చి పట్టిందనుకుంటారేమో అని బెదిరి చస్తావుండాను..."

× × ×

దోయం... ఆరూ... రెండూ... దెబ్బయినాలుగు... నేరుగా తొంభై నాలుగుకు నిచ్చెన... నాకూ ఆ పోలికలే వస్తావుండాయని జ్యోతిష్యం చెప్తావుందీ ముసిల్ది... యీమెనెత్తి మీదుండే బరువు దించేదానికని నానెత్తిపైకి బరువెత్తతానంటావుంది... ఆరూ... మూడూ... రెండూ... నూటారు... పెద్దపాము నోట్లో పడింది కాయ... పిల్లోడు పురుగులమందు తెచ్చుంటే బాగుణ్ణు... ఆ గురుమూర్తిని పోలీసులు పట్టుకొని పోకుండా వుంటే బాగుణ్ణు... యీ ముసిల్దాని పోలికలొచ్చే దానికంటే ఆ మిద్దెంటోళ్ళ పెండ్లికొడుక్కు నిజంగానే రోగమొచ్చుంటేనే బాగుణ్ణు... రెండూ... మూడు... మళ్ళా కదలేముందుకు... నేను వొంటిగా ఆడతావుంటే యెప్పుడో కొండెక్కేసుండనా?... రెండూ... మూడూ...

# పిడికిలి

## డా॥ సి. భవానీదేవి

పుట్టినప్పుడు
నా లేత పిడికిళ్ళలో
పొదువుకున్నది అక్షరాన్నే!

చిన్నప్పుడది
పాలచెక్కిళ్ళతో
బోసినవ్వుల వాగ్దానంలా
అమాయక స్వప్నతీరంలా
ఒద్దికగా ముడుచుకొని ఉండేది
కొన్నాళ్ళకి
కళ్ళు తెరిచిన పుస్తకంలా
ఒళ్ళు విరుచుకున్న స్వేదంలా
నిటారుగా నిలబడింది
ఆకాశంలోకి
సూటిగా ఎగిసిన పతంగమైంది
నిరంతరం
ఓ వెదుకు దీపమైంది.
ఆపైన
సాధికార స్వరంలా ఎగిసింది
స్వీయ అస్థిత్వ ప్రకటనంతో
స్వయం ప్రకాశ నక్షత్రమైంది.
మానవత్వాన్ని నింపుకొని
అమ్మతనమైంది
ముమ్మాటికి వెన్నెముకలా
నన్ను నిలబెట్టిన వజ్రాయుధమైంది
ఇప్పుడు...ఎప్పుడూ
ఆ అక్షరం పిడికిట్లోనే
పాపాయిలా నేను!